ఈ రోడ్డుపై ప్రయాణించేదెలా!

- బురదమయంగా కాశివారిగూడెం రోడ్డు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



తిప్పర్తి పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కాశివారిగూడెం వెళ్లే రోడ్డు

తిప్పర్తి : మండలంలోని కాశివారిగూడెం రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. చిన్నపాటి వర్షానికే దారంతా బురదమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల కాలం నుంచి కాశివారిగూడెం గ్రామానికి రోడ్డు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు. తిప్పర్తి మండల కేంద్రానికి కూతవేటు దూరంలోనే కాశివారిగూడెం ఉంది. తిప్పర్తి పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. కాశివారిగూడం రోడ్డు నుంచి రాజుపేట, జొన్నగడ్డలగూడం, గంగన్నపాలెం గ్రామాలకు ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.

రూ 5.17 కోట్ల నిధులు మంజూరు

కాశివారిగూడెం గ్రామం మీదుగా రాజుపేట గంగన్నపాలెం వరకు సుమారు 8 కి.మీ వరకు 2021–22 సంవత్సరంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా ప్రభుత్వం రూ 5.17 కోట్ల నిధులు మంజూరు చేసింది. అయితే నేటివరకు పనులు ప్రారంభానికి నోచుకోలేదు. గత సంవత్సరం టెండర్ వేసిన కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు బాగా లేకపోవడంతో కాశివారిగూడెం గ్రామానికి 108 అంబులెన్స్ సైతం రావడం లేదు. దీంతో ప్రజలు ప్రమాదాలకు గురైనప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి కాశివారిగూడెం రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామానికి వెళ్లలేకపోతున్నాం



కాశివారిగూడెం రోడ్డుపై ప్రయాణించాలంటే వర్షాకాలంలో చాలా ఇబ్బందికరంగా ఉంది. గుంతలమయంగా ఉండడం వల్ల రాత్రి సమయంలో గ్రామానికి పోవాలంటే భయంగా ఉంటోంది. నిధులు మంజూరైనా రోడ్డు పనులు చేయడంలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు పనులు ప్రారంభించాలి.

– ఎస్కే సయ్యద్, కాశివారిగూడెం

అంబులెన్స్ రావడం లేదు



కాశివారిగూడెం గ్రామానికి రోడ్డు లేకపోవడం వల్ల గ్రామంలో ప్రజలు ప్రమాదాలకు గురైనప్పుడు అంబులెన్స్ వాహనం కూడా రావడానికి భయపడి నార్కట్‌పల్లి–అద్దంకి హైవేపై ఆపుకుంటున్నారు. గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పనులు ప్రారంభించి సమస్య పరిష్కరించాలి.

– నూర్‌మహ్మద్, కాశివారిగూడెం

కాంట్రాక్టర్ ఆలస్యం చేస్తున్నాడు

కాశివారిగూడెం రోడ్డు గంగన్నపాలెం వరకు మంజూరైంది. టెండర్ వేసిన కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడంలో ఆలస్యం చేస్తున్నాడు. సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. త్వరలో పనులు ప్రారంభించకుంటే టెండర్ రద్దు చేసి మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తాం. త్వరలో రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా చూస్తాం.

– శ్రీనివాస్, పంచాయతీరాజ్, ఏఈ

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నల్లగొండ టూటౌన్ : సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నకిరేకల్ : ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నల్లగొండ టూటౌన్ : శాసనసభలో బీఆర్ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం, మంత్రులు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు గురువారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో దిష్టిబొమ్మ రెండు ముక్కలయింది. ఓ ముక్కను బీఆర్ఎస్ పార్టీ నాయకులు దహనం చేశారు. దీంతో కొంత సేపు పోలీసులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల మధ్య స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్ నాయకులు సీఎంకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలను సీఎం, డిప్యూటీ సీఎం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్‌వలి, మాలె శరణ్యారెడ్డి, జమాల్‌ఖాద్రీ, కొండూరు సత్యనారాయణ, బోనగిరి దేవేందర్, కరీంపాషా, సింగం రామ్మోహన్, కంచనపల్లి రవీందర్‌రావు, దేప వెంకట్‌రెడ్డి, మెరుగు గోపి, అయితగోని యాదయ్య, మారగోని గణేశ్, గున్‌రెడ్డి యుగందర్‌రెడ్డి, రంజిత్, వనపర్తి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ధర్నా

నకిరేకల్ : అసెంబ్లీలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని



చండూరు సెంటర్ లో ..

కోరుతూ నకిరేకల్ మెయిన్ సెంటర్ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ మాద ధనలక్ష్మీ, రామన్నపేట మాజీ ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి, నకిరేకల్, కేతేపల్లి మండలాల అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, నాయకులు నడికుడి వెంకటేశ్వర్లు, పల్లె విజయ్, రాచకొండ వెంకన్నగౌడ్, దైద పరమేషం, చౌగోని శంకర్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

చండూరులో..

చండూరు : బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా చండూరు చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళవెంకన్న, కౌన్సిలర్ కోడి వెంకన్న, అన్నెపర్తి శేఖర్, గుంటి వెంకటేశం, పెద్దగోని వెంకన్న, మండల అధికార ప్రతినిధి బొడ్డు సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ దుకాణం తనిఖీ



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు

కనగల్: రేషన్ డీలర్లు ప్రతినెలా 1వ తేదీ నుంచి కార్డుదారులకు రేషన్ సరఫరా చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్‌ఓ)వి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం కనగల్ మండలం కురంపల్లి గ్రామంలో రేషన్ షాప్‌ను ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. అక్రమాలకు పాల్పడే డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌరసరఫరాల డీఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ చండూరు గోదాం నుంచి ప్రతినెలా రేషన్ షాపులకు 31 తేదీలోపే బియ్యం సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చండూరు డీటీసీఎస్ వర్షిత్‌రెడ్డి, ఆర్ఐ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

నకిరేకల్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీలో చేరేందుకు ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య తెలిపారు. ఇంటర్ పాసై డిగ్రీలో చేరని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శుక్రవారంలోగా రిజిస్ట్రేషన్ చేసుకుని అడ్మిషన్ పొందాలని సూచించారు.

రాములు మృతికి సంతాపం

నల్లగొండ టౌన్ : రైతు సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు గద్దం రాములు మృతి ఉద్యమాలకు తీరని లోటని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య అన్నారు. గురువారం స్థానికంగా జరిగిన రాములు సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కత్తెం బుచ్చిరెడ్డి, పాక మల్లయ్య, విష్ణుమూర్తి, వెంకటేశ్వర్లు, నారాయణ, భాస్కర్‌రెడ్డి, పుల్లయ్య, శివమ్మ, మల్లెపల్లి ఆదిరెడ్డి, కట్ట వెంకట్‌రెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి, జిల్లా యాదయ్య, వెంకన్న, ముత్యాలు, వెంకటేశ్, కృష్ణారెడ్డి, అనంతరెడ్డి, శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతులకు అవగాహన

మునుగోడు: రుణమాఫీకి అన్ని అర్హతలు కలిగి ఉండి ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో పేరు లేని రైతులు తమ వద్ద దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. గురువారం మండలంలోని రత్తిపల్లి గ్రామంలో రుణమాఫీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి 2018 డిసెంబర్ 12వ తేదీ నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీలోపు రూ.లక్షా 50 వేల రుణం తీసుకుని మాఫీ కాని రైతులు గ్రీవెన్స్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మౌనిక, పంచాయతీ కార్యదర్శి రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మాదగోని రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

చండూరు : గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గాంధీజీ విద్యాసంస్థలో చండూరు మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ చండూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు, గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, సత్యనారాయణమూర్తి, కిరణ్, కృష్ణయ్య, ఆనంద్, వెంకటేశ్వర్లు, వెంకన్న, శివప్రసాద్, మణిశంకర్, లింగస్వామి, ఆంజనేయులు, నాగరాజు, యాదగిరి, విజయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

మర్రిగూడ : మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే -2024)పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి బిట్టు శ్రీను మాట్లాడుతూ నవంబర్ మాసంలో ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు నిర్వహించే నాస్ సర్వే ఫలితాల్లో మర్రిగూడ మండలానికి మెరుగైన స్థానం వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ఉడావత్ లచ్చిరాం, విఠల్‌నాయక్, రమేష్, ప్రవీణ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బుచ్చయ్య, మాలతి, శారద తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానం



సిరికొండ నాగరాజు (ఫైల్)

నకిరేకల్ : మండలంలోని తాటికల్ గ్రామానికి చెందిన సిరికొండ నాగరాజు (42) గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డాక్టర్ పుల్లారావు.. నాగరాజు కుటుంబీకులతో మాట్లాడి నేత్రదానం చేయాలని కోరారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో డాక్టర్లు హరినాథ, ప్రనూష, రీతీష్‌లు తాటికల్ గ్రామానికి వెళ్లి నాగరాజు నేత్రాలను సేకరించారు. సిరికొండ నాగరాజుకు భక్త కన్నప్ప బిరుదు ఇస్తున్నామని ఐ బ్యాంక్ వారు ప్రకటించారు.

అంగన్‌వాడీల్లో తల్లిపాల వారోత్సవాలు



చిట్యాల: ఉరుమడ్లలో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది



కట్టంగూర్ : మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద

కట్టంగూర్ : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నకిరేకల్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, భిక్షమమ్మ, పద్మ, చంద్రకళ, సైదమ్మ, లలిత, మంగ, శోభ పాల్గొన్నారు.

చిట్యాల మండలంలో..

చిట్యాల: మండలంలోని వనిపాకల, ఉరుమడ్ల గ్రామాల్లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లులకు తల్లి ముర్రుపాల ప్రాముఖ్యత వివరించారు. తల్లిపాలతో చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. డాక్టర్ మాధవి, పంచాయతీ కార్యదర్శి ఉప్పునూతల నర్సింహ, సిద్ది వీర సోమయ్య, హెచ్ఎంలు శ్రీనయ్య, అంగన్‌వాడీ టీచర్లు మేడి జానకమ్మ, అంజమ్మ, లలిత, ధనమ్మ, ఏఎన్ఎం స్వరాజ్యం, ఫీల్డ్ అసిస్టెంట్ మర్రి రమేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం మండలంలో తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. పలు గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు మహిళలు, చిన్నారులతో ర్యాలీలు నిర్వహించారు. ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో హాస్టళ్ల పరిశీలన



కేతేపల్లి: సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్టు శివకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ బాలుర హాస్టల్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో బాణావత్ దేవా, మిట్టపల్లి ఆనంద, పర్వతం కిరణ్‌కుమార్, సైదులు, నరసింహ, యాకోబు, యాదయ్య, భరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలి

కేతేపల్లి: సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటెపాక కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేతేపల్లిలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని గురువారం కేవీపీఎస్ నాయకులు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వసతి గృహంలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వంటెపాక కృష్ణ మాట్లాడుతూ మెస్ ఛార్జీలను రూ.2500, ప్యాకెట్ మనీ రూ.1500 కు పెంచాలని డిమాండ్ చేశారు. దోమ తెరలు, కిటికీలకు జాలీలు లేకపోవడంతో విద్యార్థులు విష జ్వరాల బారిన పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి వంగూరి వెంకన్న, గోలి ఎల్లయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రాధాన్యం

కట్టంగూర్ : ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని నకిరేకల్ క్లస్టర్ ఏపీడీ బి.నర్సింహారావు తెలిపారు. గురువారం మునుకుంట్ల గ్రామంలో ఎవెన్యూ ప్లాంటేషన్, ఈదులూరు గ్రామంలో హార్టికల్చర్ ప్లాంటేషన్ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఏపీఓ రాంమోహన్, ఈసీ శ్రీధర్, క్లస్టర్ టీఏ రమణ, విజయ, ఎఫ్ఏ యాదగిరి ఉన్నారు.

కాచం కృష్ణమూర్తికి నివాళి

చండూరు(గట్టుప్పల్) : తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు కాచం కృష్ణమూర్తి 18వ వర్ధంతిని సీపీఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం గట్టుప్పల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గట్టుప్పల మండల కమిటీ సభ్యుడు కర్నాటి సుధాకర్ పాల్గొని కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎండీ రబ్బాని, కర్నాటి వెంకటేశం, యాదయ్య, పెదగాని నరసింహ, బుచ్చిరెడ్డి, భిక్షం, చంద్రయ్య, సాయిలు, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ అందజేత

శాలిగౌరారం: మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామానికి చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణ తన తండ్రి యంగలి అంజయ్య జ్ఞాపకార్థం బాడీ ఫ్రీజర్‌ను గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అల్లి సైదులు, చివుట సైదులు, అక్కెనపల్లి శ్రీరాములు, అవిలయ్య, సుల్తాన్ యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నిరసన ర్యాలీ

నకిరేకల్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని కోరుతూ నకిరేకల్‌లో పీడీఎస్‌యూ నాయకులు గురువారం నిరసన ర్యాలీ చేపట్టారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి పోలె పవన్, పిట్టల అనిల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు మాసాలు గడుస్తున్నా విద్యారంగంపై శ్రద్ధ పెట్టడం లేదన్నారు. రాజు, రాకేష్, రవి, కరుణాకర్, ప్రేమ్‌కుమార్, నవీన్, సురేష్, వెంకటరాజు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



మునుగోడు : చెక్కు అందజేస్తున్న నాయకులు

చండూరు : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో చండూరు మున్సిపాలిటీలో పలువురికి మంజూరైన రూ.9,11,500 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ దోటి సుజాత వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో కోడి శ్రీనివాసులు, కౌన్సిలర్ కొన్‌రెడ్డి యాదయ్య, రాంమూర్తి, మారయ్య, వేణు, దశరథ, మల్లేష్, జనార్దన్, వెంకన్న, రాజు, లక్ష్మన్, వెంకటేశం, శివ, చరణ్, అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: మండలంలోని చీకటిమామిడి, ఊకొండి, కొరటికల్ గ్రామాల్లో పలువురికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు అందజేశారు. కార్యక్రమంలో తాటికొండ సైదులు, పాలకూరి యాదయ్యగౌడ్, అనంత లింగస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

నల్లగొండ రూరల్ : పట్టణంలోని 19వ వార్డు శ్రీనగర్ కాలనీ రోడ్లు, మురికి కాల్వలు, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆకునూరి సత్యనారాయణ గురువారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వర్షాకాలంలో కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

సుప్రీం కోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ సంబరాలు



చిట్యాల : మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



శాలిగౌరారం : అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దళిత సంఘాల నేతలు



చండూరు : మంద కృష్ణ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

చిట్యాల: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ చిట్యాలలో ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి శంకర్ మాదిగ, ఎరసాని గోపాల్, నోముల పురుషోత్తం, పోకల రాములు, జిట్ట నర్సింహ, ఇస్తారి పాల్గొన్నారు.

శాలిగౌరారం: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో చింత ధనుంజయ్య, మాచర్ల శ్రీను, కూరం లింగయ్య, వెంకన్న, లక్ష్మినారాయణ, నోముల జనార్దన్, సుల్తాన్ యల్లయ్య, భూపతి అంజయ్య, దొంతూరి శంకరయ్య, కడారి అంజయ్య, పెరుమాండ్ల నరేశ్, పడాల రమేశ్, సైదులు, గణేశ్, భిక్షం పాల్గొన్నారు.

మంద కృష్ణ ఫ్లెక్సీకి పాలాభిషేకం

చండూరు : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో చండూరులో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కురుపాటి గణేశ్ ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఇరిగి రామన్న, ఇరిగి లక్ష్మయ్య, ఇరిగి నరసింహ తదితరులు పాల్గొన్నారు. మంద కృష్ణమాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని బీజేపీ జిల్లా నాయకుడు అన్నెపర్తి యాదగిరి అన్నారు. గురువారం ఆయన చండూరులో మాట్లాడారు.

మంద కృష్ణ పోరాట ఫలితంగానే తీర్పు

మర్రిగూడ : ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ 30 సంవత్సరాల పోరాట ఫలితంగానే నేడు సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు జిల్లా తిరుమలేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి, మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటంలో అనేక మంది మాదిగలు ప్రాణాలర్పించారని అన్నారు. జిల్లా నగేష్, వడ్డె వెంకటేష్, బూడిద సురేష్, మైలారపు రాజు, ఇస్కిళ్ల మహేందర్, గ్యార రమణ, పల్లె ప్రవీణ్, రవి, శివాజీ, శేఖర్, నరసింహ, జంగయ్య, చిన్న, ప్రకాశ్, యాదయ్య, సత్యానంద్, రామలింగాచారి తదితరులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం హర్షణీయమని నామాపురం మాజీ ఎంపీటీసీ ఊరిపక్క సరితనగేష్ అన్నారు. గురువారం ఆమె మర్రిగూడ మండల కేంద్రంలో మాట్లాడారు.

నార్కట్‌పల్లి : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు.. ప్రధాని నరేంద్రమోడీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ కారణంగానే సాధ్యమైందని బీజేపీ మండల అధ్యక్షుడు కొరివి శంకర్ అన్నారు. గురువారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు.

నకిరేకల్ : ఎన్నికల ముందు ప్రధాని నరేంద్రమోదీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని హామీ ఇవ్వడంతో ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న అన్నారు. నకిరేకల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును స్వాగతిస్తున్నాం

- అసెంబ్లీలో నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ అంశంపై ఆయన మాట్లాడారు. దశాబ్దాల కాలంగా మాదిగ ఉపకులాల ఆకాంక్ష, వారి పోరాటాన్ని నేడు సుప్రీం కోర్టు గుర్తిస్తూ గొప్ప తీర్పు ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగల పక్షపాతిగా ఉందన్నారు. మాదిగ కమ్యూనిటీ కష్టాలు తెలిసిన వ్యక్తిగా సీఎం రేవంత్‌రెడ్డి ఉండడం తమ జాతి అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగ రిజర్వేషన్ ఉద్యమం సాగుతున్నప్పుడు ఆనాటి సీఎం రాజశేఖరరెడ్డి మద్దతుగా నిలిచారని గుర్తు చేశారు. నాడు రాజశేఖరరెడ్డి.. నేడు మాదిగలను ముందుండి నడిపించింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. మాదిగల ఉద్యమాన్ని చీల్చి రాజకీయంగా వాడుకుంది బీఆర్ఎస్ పార్టీ అని వేముల వీరేశం విమర్శించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వసతులు కల్పిస్తాం



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రవీందర్‌రావు

మర్రిగూడ : మండలంలోని రాంరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయించి సకాలంలో పూర్తి చేస్తామని నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్‌రావు అన్నారు. గురువారం గ్రామంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామ ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు కేంద్రంలో నెలకొన్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పగిళ్ల గిరి, ఫీల్డ్ అసిస్టెంట్ సల్వోజు యాదయ్య, ఆశా కార్యకర్త లపంగి తబిత, నారమ్మ, అలివేలు, రాణి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : భవన నిర్మాణ కార్మికులను నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో పెయింటింగ్, కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో వారు మాట్లాడారు. కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, కార్మికులకు ప్రసూతి, వివాహ కానుకలను రూ.30 వేల నుంచి లక్ష రూపాయల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. భీమనపల్లి శంకర్, సలివోజు సైదాచారి, జగన్, జి.రమేష్, బైరు నర్సింహ, ప్రభు, ఆంజనేయులు, సోమయ్య, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

నార్కట్‌పల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని సీపీఐ ఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎం జిల్లా కమిటీ సభ్యులు, ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చెరుకు పెద్దులు, మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, చింతపల్లి బయన్న, దండు రవి, నన్నేసాహేబ్, కంట మహేశ్వరం తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యంపై కదిలిన యంత్రాంగం

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు సిబ్బంది చర్యలు చేపట్టారు. గత 29వ తేదీన పారిశుద్ధ్యం అస్తవ్యస్తం అనే కథనం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీంతో రెండు, మూడు రోజులుగా మండల కేంద్రంలో మురికి కాలువలు శుభ్రం చేయడం, బ్లీచింగ్ చేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఇప్పటికే అవసరమైన చోట వీధిలైట్లు వేయించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

నకిరేకల్ : మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ బాలయ్య తెలిపారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని 4వ వార్డు సంతోష నగర్‌లో పలు వీధులను గురువారం ఆయన పరిశీలించారు. వీధులు బురదమయంగా ఉండకుండా మట్టి పోయించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ గౌతం, వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్యశ్రీనివాస్ ఉన్నారు.

కనగల్ ఎస్ఐకి సన్మానం

కనగల్ : నూతన ఎస్ఐ విష్ణుమూర్తిని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు వరికుప్పల రవి కలిసి శాలువాలతో సన్మానించారు. వారి వెంట నెలగొందరాసి ముత్తయ్య, చనగాని నగేష్, రమేష్, శ్రీహరి, రవి, లింగస్వామి, ప్రకాష్, రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

బీజీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

నకిరేకల్ : బీజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు జన్మదినం సందర్భంగా నకిరేకల్‌లో గురువారం 1500 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాసన మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మేనిఫెస్టో కమిటీ మెంబర్ చామల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప, పూజర్ల శంభయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.